క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



వెంకటాపురం(కె): వెంకటాపురం ఎస్సైగా కొప్పుల తిరుపతిరావు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న తిరుపతి సీఐగా పదోన్నతి పొంది హుజూరాబాద్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో వాజేడు ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కొప్పుల తిరుపతిరావును వెంకటాపురానికి బదిలీ చేశారు.

వాజేడు ఎస్సైగా అశోక్..



వాజేడు: వాజేడు ఎస్సైగా రేఖ అశోక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన కొప్పుల తిరుపతిరావు వెంకటాపురం(కే)కు బదిలీ కాగా ఆయన స్థానంలో అక్కడ పని చేస్తున్న రేఖ అశోక్‌ను నియమించారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

వెంకటాపురం(కె): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని కర్రవానిగుంపు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్రవానిగూంపు గ్రామానికి చెందిన మొడెం సమ్మయ్య (60) పశువుల కాపరిగా జీవనం సాగిస్తుండేవాడు. అతడికి బంధువులు, కుటుంబ సభ్యులు ఎవరూ లేక పోవటంతో ఒంటరిగా జీవిస్తున్నాడని తెలిపారు. కాగా ఇటీవల కాలంలో కంటి చూపు మందగించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడన్నారు. దీంతో ఒంటరిగా జీవించలేక మనస్థాపానికి గురై గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు.

టిప్పర్, బస్సు ఢీ.. 20 మందికి గాయాలు



టేకుమట్ల(రేగొండ): టిప్పర్, బస్సు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో 20 మందికి గాయాలయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని రూపిరెడ్డిపల్లిలో బుధవారం జరిగిన ఘటనకు సంబంధించి, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి నుంచి పరకాల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, పరకాల నుంచి భూపాలపల్లికి వెళ్తున్న టిప్పర్ అదుపుతప్పి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 20మంది ప్రయాణికులు గాయపడ్డారు. టిప్పర్ వెనకాలే వస్తున్న ఓ కారు వెనక నుంచి టిప్పర్‌ను ఢీకొనగా కారు స్వల్పంగా ధ్వంసం కాగా కారులో ప్రయానిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదని తెలిపారు. ప్రమాదస్థలానికి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి చేరుకుని గాయపడినవారిని అంబులెన్స్‌లో పరకాల ఆస్పత్రికి తరలించి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



పలిమెల: మంథనిలో ఈనెల 20వ తేదీన పుట్ట లింగమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ జవ్వాజి తిరుపతి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో పెద్దపల్లి జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్ట మధు వ్యక్తిగత సహాయకుడు రఘు ప్రసాద్‌తో కలిసి జాబ్ మేళా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ.. ఈ జాబ్ మేళా ద్వారా 8వ తరగతి నుంచి పీజీ వరకు చదివిన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు తెలిపారు. జాబ్ మేళాలో బహుళజాతి కంపెనీలతో పాటు స్థానిక కంపెనీలు కూడా పాల్గొని ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు జవ్వాజి పుష్పలత, ఆలం సత్యనారాయణ, చిడెం నాగయ్య, నాయకులు మడే సత్యనారాయణ, జనగామ శ్రీనివాస్, గుమ్మడి శంకర్, ఆగ్గు శ్రీనివాస్, సంతోష్, ఎర్ర ముత్తయ్య పాల్గొన్నారు.

'రాష్ట్రంలో అవినీతి పాలన'

టేకుమట్ల: రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాపన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో రూ.వేల కోట్లను మాయం చేశారని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు చందుపట్ల సత్యపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు దేశెట్టి గోపాల్, జిల్లా నాయకులు బట్టల మొగిళి, బిల్ల కొమురయ్య, బీజేవైఎం మండల అధ్యక్షుడు కొలుగూరి రమేష్, బండారి సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



ములుగు రూరల్: గెలుపొందిన క్రీడాకారులతో ఎమ్మెల్యే సీతక్క

ములుగు రూరల్: క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ఎమ్మెల్యే సీతక్క అన్నారు. అల్లెంసుదర్శ్ జ్ఞాపకార్థం కాకతీయ యువజన సంఘం ఆధ్వర్యంలో సబ్ డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీల ముగింపు కార్యక్రమానికి బుధవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలు స్నేహ పూర్వక వాతావరణంలో నిర్వహించారుకోవాలని అన్నారు. క్రీడల్లో ప్రథమ స్థానంలో నిలిచిన తాడ్వాయి మండలం నర్సాపూర్ జట్టుకు షీల్డ్, రూ.10 వేల నగదు అందజేశారు. రెండవ బహుమతి కొత్తగూడెం మండలం రాంపూర్ జట్టుకు రూ.5,016లను అందజేశారు. డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య, సర్పంచ్ చింత శ్యామల, ఎంపీటీసీ ఈక సరస్వతి, సర్వాపూర్ సర్పంచ్ రాజు, భిక్షపతి, యాప నారాయణ, భాస్కర్, నరేష్, సతీష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పరామర్శ

మండలంలోని దేవగిరిపట్నం గ్రామానికి చెందిన తుమ్మ బాలశివరెడ్డి మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే సీతక్క బుధవారం పరామర్శించారు. బాలశివరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన బూర గణేష్, తేజవత్ రాజు కుమార్‌లు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, సర్పంచ్‌లు ఇన్నారెడ్డి, అహ్మద్‌పాషా, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సమ్మయ్య ఉన్నారు.

పట్టుదలతో శ్రమిస్తే ఉద్యోగం దక్కుతుంది..

ఏటూరునాగారం: పట్టుదలతో శ్రమిస్తే ఉద్యోగం దక్కుతుందని ఎమ్మెల్యే సీతక్క అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వాకర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, కోచ్ పర్వతాల కుమారస్వామి ఆధ్వర్యంలో క్రీడాకారులు, విద్యార్థులను జెడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో కలుసుకొని వారికి సూచనలు చేశారు. ఏటూరునాగారం స్పోర్ట్స్ క్లబ్ కోచ్ కుమారస్వామి ఆధ్వర్యంలో క్రీడా మైదానంలో ప్రాక్టీస్ చేసిన వారు కానిస్టేబుల్, ఫారెస్టు ఉద్యోగాలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జిల్లా కలెక్టర్, సంబంధిత మంత్రితో మాట్లాడి మినీ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తా అన్నారు.

శివకుమార్ మృతి తీరనిలోటు



ఏటూరునాగారం: పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎన్ఎస్‌యూఐ నాయకుడు కుమ్మరి శివకుమార్ మృతి తీరని లోటు అని సీతక్క అన్నారు. శివకుమార్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆమె వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకన్న, మండల అధ్యక్షుడు చిటమట రఘు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాలరాజు, బ్లాక్ ప్రధాన కార్యదర్శి వావిలాల నరసింహారావు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్న ఎల్లయ్య, ఎంపీటీసీ గుడ్ల శ్రీలత దేవేందర్, పీఏసీఎస్ డైరెక్టర్ వంగపండ్ల రవి, నాయకులు లాలయ్య, ప్రతినిధి ముక్కెర లాలయ్య, రియాజ్, సులేమాన్, సరికొప్పుల శ్రీనివాస్, కొండగొర్ల పోశయ్య, సర్వ అక్షిత్, ఎండీ గౌస్, వసంత శ్రీనివాస్, మామిడి రాంబాబు పాల్గొన్నారు.

గిరిజనుల ఆర్థిక బలోపేతానికి ప్రోత్సాహం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రభాకర్

మంగపేట: ప్రభుత్వం గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రోత్సాహం అందిస్తుందని ఐటీడీఏ జిల్లా పెసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్ అన్నారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో నీలివిప్లవం(చేపలపెంపకం) గిరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ఏర్పాటుపై ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్పెషలాఫీసర్ తుల రవి, జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీపతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మత్స్య సంఘాల ఏర్పాటు ద్వారా ఉచిత చేపపిల్లలు, వలలు, తెప్పలు, 75 శాతం సబ్సిడీపై శీతలీకరణ వాహనాలు, సైకిళ్లు, మోటార్ సైకిల్ యంత్రాలు అందిస్తుందన్నారు. గ్రామంలో జీపీడీపీ ప్రోగ్రాం ద్వారా పంచాయతీ కార్యదర్శులు, పెసా మొబిలైజర్లు సంయుక్తంగా పని చేస్తూ గిరిజనులకు ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయగలుగుతామన్నారు. దీంతో గిరిజనుల తలసరి ఆదాయం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు పెసా మొబిలైజర్లు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ ధర్మరాజు

మొగుళ్లపల్లి: బ్యాంకు ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎస్‌బీఐ మేనేజర్ ధర్మరాజు అన్నారు. బుధవారం ఎస్‌బీఐ బ్యాంక్ మహా లాగిన్ డే సందర్భంగా వెలుగు మండల సమైక్య ఏపీఎం రవివర్మను బ్యాంకు మేనేజర్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. తీసుకున్న రుణాలను తిరిగి సకాలంలో చెల్లింపులు చేస్తున్న మహిళల తీరు స్ఫూర్తిదాయకమని అన్నారు. స్వయం సహాయక సంఘ సభ్యులకు వ్యాపార విస్తరణ, వివిధ రకాల ఆదాయ మార్గాల కోసం బ్యాంకు ఎప్పుడు హితోధికంగా ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి వివోఏలులు మహిపాల్,శంకర్, పావని, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ కల్యాణి

వెంకటాపురం(ఎం): యాసంగి వరి పంట సాగు చేస్తున్న రైతులు కాండం తొలుచు పురుగు నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారిని కల్యాణి సూచించారు. బుధవారం మండలంలోని రామానుజాపురం గ్రామపంచాయతీ పరిధి పంట పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత సంవత్సరం కంటే ఈసారి కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. వరి పంట నాటిన 15 రోజులలోపు ఎకరాకు కార్బోఫ్యూరాన్ గుళికలు 3జి 10 కేజీలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ ఫోర్ జి గుళికలు 8 కేజీలు లేదా క్లోరంట్రా నిల్ ప్రోల్ 0.4 జి గుళికలు 4 కేజీలు వేయాలన్నారు. లార్వాదశలో వరి పైరును కాండం తొలుచు పురుగు నష్ట పరుస్తున్నట్లయితే క్వినాల్ ఫాస్ రెండు మిల్లీలీటర్లు, ప్రోపెనోఫాస్ రెండు మిల్లీ లీటర్లు, కార్టాప్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సీహెచ్ కావ్య, రైతులు ఉన్నారు.

మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు



గొత్తికోయలతో మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వరరావు



యువకులకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న ఎస్సై

ఎస్ఎస్ తాడ్వాయి: మావోయిస్టులకు ఆశ్రయం ఇవ్వొద్దని తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వరరావు గొత్తికోయలకు సూచించారు. మండలంలోని తక్కళ్లపాడు గొత్తికోయగూడెంలో బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గూడెంలో ఎంతమంది గొత్తికోయలు నివసిస్తున్నారని వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఎస్సై గ్రామస్తులతో మాట్లాడుతూ.. కొత్త వ్యక్తులు ఎవరైనా గూడెంలోకి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మావోల కదలికలపై సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ..

మండలంలోని బొల్లెపెల్లి గ్రామానికి చెందిన నవయుగ యూత్‌కు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై వెంకటేశ్వరరావు రెండు వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన యువతతో మాట్లాడుతూ.. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు.

సెంట్రల్ లైటింగ్ నిర్మాణానికి కృషి



మాట్లాడుతున్న సర్పంచ్ రామ్మూర్తి

ఏటూరునాగారం: మండల కేంద్రంలో వైజంక్షన్ నుంచి చేపల మార్కెట్ వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు సర్పంచ్ ఈసం రామ్మూర్తి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ అభివృద్ధిపై గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ సభలో సెంట్రల్ లైటింగ్ నిర్మాణానికి, కూరగాయల మార్కెట్‌లో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం, సీసీ రోడ్లు, సైడ్ కాల్వల నిర్మాణాలు చేపట్టడం కోసం తీర్మానాలు చేశామన్నారు. నూతన గ్రామ పంచాయతీ భవనం కోసం ప్రభుత్వ స్థలం ఇప్పించాలని తహసీల్దార్‌కు విన్నవించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కర్ల అరుణ, పంచాయతీ కార్యదర్శి అశోక్, జూనియర్ అసిస్టెంట్ రవీందర్, వార్డు సభ్యులు శ్రీనివాస్, రంజిత్, నాగసాగర్, కనకతార, నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు చిటమట వసంత, సరికొప్పుల శ్రీలత, లలిత, రాజేశ్వరి గ్రామస్తుడు రాంనర్సయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



మందులు అందజేస్తున్న డాక్టర్ అన్మిషా

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని అమ్మ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం స్త్రీలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్త్రీల వైద్య నిపుణురాలు అన్మిషా మహిళలకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అమ్మ ఆస్పత్రి ద్వారా ఉచితంగా పరీక్షలు, మందులు ఇవ్వడం జరిగిందన్నారు. 200ల మందికి పరీక్షలు చేసి రోగాల బారిన పడకుండా అవగాహన కల్పించారు. గర్భిణులు పోషక విలువలు కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యజమాన్యం భరత్‌రెడ్డి, ప్రతిమరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలను ఖాళీ చేయించొద్దు



ఎస్‌ఓ రాజ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలో టైగర జోన్లపేరుతో ఏజెన్సీ గ్రామాలను ఖాళీ చేయించొద్దని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ అధ్యక్షుడు చంద్రన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట పోడు భూములకు పట్టాలివ్వాలని, టైగర్ జోన్లతో గ్రామాలు ఖాళీ చేయించొద్దని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఐటీడీఏ ఎస్ఓ రాజ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పించి మాట్లాడారు. ఎలాంటి షరతులు లేకుండా పోడు భూములకు పట్టాలివ్వాలని, అటవీ సంరక్షణ నియమాల చట్టం 2022ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. వైల్డ్ ఫారెస్టు విధానంలో కొత్తగూడెం మండలం తొర్రూరు తిమ్మాపురం గ్రామాన్ని తొలగించే విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాకేష్, ప్రభాకర్, లింగయ్య, కొమురయ్య, సారంగం, ఎల్లయ్య, రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



స్వయం పాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థినులు

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని మేడారం గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థినులు ఉపాధ్యాయులు వ్యవహరించి తోటి విద్యార్థులకు బోధన తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం సరోజన, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు పూజలు



పూజలు చేస్తున్న సిబ్బంది

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం ఎండోమెంట్ కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్న పిరీల్ల వీరయ్య అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరారు. ఆయన త్వరగా కోలుకోవాలని మేడారం ఎండోమెంట్ తోటి ఉద్యోగులు సమ్మక్క–సారలమ్మలకు, గోవిందరాజు, పగిడిద్దరాజులకు బుధవారం కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ జూనియర్ అసిస్టెంట్లు వీరన్న, బాలకృష్ణ, మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయాల్లోకి రాక ముందే సేవలు



మాట్లాడుతున్న జనార్దన్

కాటారం: పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధు రాజకీయాల్లోకి రాకముందు నుంచే ట్రస్ట్ ద్వారా సేవలు కొనసాగిస్తున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట జనార్దన్, నాయకులు అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పుట్ట లింగమ్మ ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు అన్నం పెడితే కాంగ్రెస్ నాయకులు తమ అక్కసును వెళ్లగక్కుతున్నారని విమర్శించారు. కళాశాలలో పేద విద్యార్థుల ఆకలి తీర్చాలన్న సంకల్పంతో ట్రస్ట్ ద్వారా మధ్యాహ్న భోజనం పెడుతుంటే కాంగ్రెస్ నాయకులు ఎన్నికల స్టంట్ అంటూ మాట్లాడం విడ్డూరంగా ఉందన్నారు. నియోజకవర్గంలో పుట్ట మధు ప్రజలకు అందుబాటులో ఉంటూ పేదవారికి అండగా నిలుస్తున్నారని స్పష్టం చేశారు. మధును, ట్రస్ట్ సేవలను విమర్శించే ముందు కాంగ్రెస్ నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు భూపెల్లి రాజు, సబ్‌డివిజన్ యూత్ అధ్యక్షుడు నాయిని శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు రామిల రవి, ఎస్సీసెల్ అధ్యక్షుడు కొండగొర్ల వెంకటస్వామి, సీనియర్ నాయకులు మండల లక్ష్మారెడ్డి, ఊర వెంకటేశ్వర్‌రావు, దబ్బెట రాజేష్, బాలరాజు, చీమల వంశీ, బొడ్డు రాజబాపు, శేఖర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బంజారాలకు ప్రత్యేక గుర్తింపు



భూపాలపల్లి రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం బంజారాలకు ప్రత్యేకంగా గుర్తింపునిచ్చి తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. సేవాలాల్ సేనా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని భారత్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం సేవాలాల్ సేనా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గిరిజనుల జనాభాధమాష ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేధిక పంపిందన్నారు. జిల్లా కేంద్రంలో సేవాలాల్ కమ్యూనిటీ హాల్ కోసం స్థలం కేటాయింపు పూర్తి కావచ్చిందన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి భారత్ ఫక్షన్‌హాల్ వరకు ఆశ్రమపాఠశాల విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి శైలజ, ఎంపీపీ మండల లావణ్య సాగర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సెగ్గం సిద్దు, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బుర్ర రమేష్, మాజీ ఎంపీపీ క్లెవు రఘుపతిరావు పాల్గొన్నారు,

మొగుళ్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం మండంలోని రంగాపురం, ఇస్సిపేట, మేదరమట్ల, అంకుషాపురం, మొగుళ్లపల్లి గ్రామాల్లో సుమారు రూ.1 కోటి 40 లక్షల అభివృద్ధి పనులకు శుకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చొరవతో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సహకారంతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా దృష్టి లోపం ఉన్న వారికి డిప్యూటీ డీఎంహెచ్ఓ కొమురయ్య, మండల వైద్యాధికారి నాగరాణి ఆధ్వర్యంలో కళ్ల అద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జోరుక సదయ్య, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు ఉన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

వాజేడు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని డిప్యూటీ తహసీల్దార్ సయ్యద్ సర్వర్, సర్పంచ్ పాయం జయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం నుంచి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను కొమురం భీమ్ యూత్, గ్రామస్తుల ఉమ్మడి సహకారంతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రిబ్బన్ కత్తిరించి వాలీబాల్ పోటీలను ప్రారంభించి వారు మాట్లాడారు. క్రీడలతో స్నేహభావం పెరుగుతుందన్నారు.